ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

మంగళవారం 9 జూలై 2024





అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

వేటు తప్పదా..?

పోలీసు శాఖలో బదిలీల ఫీవర్

జిల్లావ్యాప్తంగా పోలీసు శాఖను బదిలీల ఫీవర్ పట్టుకుంది. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులకు వెన్నుదన్నుగా నిలిచి టీడీపీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేసిన పోలీసులపై వేటు పడనుంది. అలాంటి వారికి బదిలీ తప్పదని ప్రభుత్వం సంకేతాలు ఇస్తోంది. ఈ మేరకు కసరత్తు సైతం మొదలు పెట్టింది. దీంతో పోలీసుల్లో ఆందోళన మొదలైంది. ఎప్పుడు, ఎవరిపై వేటు పడుతుందోనన్న చర్చ ఆ శాఖలో జోరుగా సాగుతోంది. జిల్లాలో కొందరు పోలీసులు గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగి అత్యుత్సాహం ప్రదర్శించారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. పరిధి దాటి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వైసీపీ నేతలకు కొంతమంది డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు తొత్తులుగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి.

- ధర్మవరం





ప్రక్షాళన మొదలైందా?

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టి, కార్యాచరణ మొదలు పెట్టింది. జిల్లాలవారీగా పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు సేకరిస్తోంది. పలువురిపై వేటు తప్పేలా లేదు. జిల్లాలో కొంతమంది డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నట్టు ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఈ మేరకు జాబితా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గత వైసీపీ హయాంలో పలువురు ఎస్ఐలు ఇష్టానుసారం వ్యవహరించారు. వైసీపీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతూ ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులకు గురిచేశారన్నది బహిరంగ రహస్యమే. వైసీపీ కార్యకర్తల్లా పనిచేశారన్న అపవాదు కూడా లేకపోలేదు.

కోరి తెచ్చుకున్న వైసీపీ నేతలు



సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందు వైసీపీ ప్రజాప్రతినిధులు ఏరి కోరి సీఐ, ఎస్ఐ, కొంతమంది సిబ్బందిని తమ నియోజవర్గాలకు తెచ్చుకున్నారు. దీంతో ఆ పోలీసు అధికారులు.. వైసీపీ ప్రజాప్రతినిధుల పట్ల స్వామిభక్తి చాటుకునేందుకు పోటీపడ్డారు. నియోజకవర్గంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతి పరులను గుర్తించి వారిపై గంజాయి, మద్యం, ఇతరత్రా కేసులు బనాయించారు. మరికొంతమంది నాయకులపై ఏకంగా రౌడీషీట్ ఓపెన్ చేసి, నయానో.. భయానో.. దారికి తెచ్చుకున్న ఘటనలు లేకపోలేదు. మరికొంతమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాటి నుంచి తప్పించుకునేందుకు పార్టీని వీడి వైసీపీలోకి చేరాల్సి వచ్చింది. హిందూపురంలో ఓ సీఐ.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పినట్టు వ్యవహరిస్తూ మైనార్టీ, బీసీ నాయకులపై అనేక అక్రమ కేసులు బనాయించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కదిరిలో ఒకరు, ధర్మవరం డివిజన్‌లో ఇద్దరు, పుట్టపర్తి, పెనుకొండ డివిజన్లలో సీఐలు, పలువురు ఎస్ఐలు అత్యుత్సాహం ప్రదర్శించి, మాజీ ప్రజాప్రతినిధులతో అంటకాగారన్న విమర్శలు బలంగా వినిపించాయి. కొంతమంది సీఐ, ఎస్ఐలు వైసీపీ నేతలతో కలిసి చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావు. ఇటువంటి పోలీసు అధికారులకు చెక్ పెట్టాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. వారిపై చర్యలు తప్పవని తెలుస్తోంది.

వైసీపీతో అంటకాగిన అధికారులపై చర్యలు!

జాబితా సిద్ధం చేసిన టీడీపీ నేతలు

కీలక స్టేషన్ల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ చక్కర్లు

జాబితాను సిద్ధం చేస్తున్న టీడీపీ నేతలు?

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రాగానే వైసీపీ మాజీ ఎమ్మెల్యేలకు తొత్తులుగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిలో బదిలీల ఆందోళన మొదలైంది. దీంతో ఎన్నికైన కూటమి ప్రజాప్రతినిధులు.. పోలీసు అధికారుల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. మరికొంతమంది ప్రజాప్రతినిధులు.. డీఎస్పీ స్థాయి అధికారులపై కూడా సీఎం చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో త్వరలోనే బదిలీ వేటు పడే అవకాశం లేకపోలేదు. విషయం తెలుసుకున్న కొంతమంది పోలీసు అధికారులు.. తమకున్న రాజకీయ పరిచయాలతో అనుకూలమైన పోలీసు స్టేషన్లకు బదిలీ చేయించుకునేందుకు ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నట్లు వినికిడి. కొంతమంది ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా వ్యవహరించే పోలీసు అధికారుల పేర్లను కూడా ఇప్పటికే సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. మరికొంతమంది పోలీసు అధికారులు కోరుకున్న కీలక ప్రాంతాలకు పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. మరికొంతమంది పోలీసు అధికారులు.. టీడీపీ నేతలకు వినతిపత్రాలను సైతం అందజేస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా పోలీసు శాఖలో భారీగా బదిలీలు జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలిచ్చింది.

కలెక్టరేట్‌లో 207 వినతులు

పుట్టపర్తి, జూలై 8: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 207 వినతులు అందాయి. వాటిని సకాలంలో పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అభిషేక్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. అర్జీదారుడు సంతృప్తి పొందేలా పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి పేర్కొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తిరూరల్, జూలై 8: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 35 అర్జీలు అందినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్‌లో ఎస్పీ ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, సీఐ శ్రీహర్ష, అర్జీదారులు పాల్గొన్నారు.

పురంలో త్వరలో

డిజిటల్ సెన్సార్ ట్రాక్

■ జేటీసీ బసిరెడ్డి



హిందూపురం అర్బన్, జూలై 8: పట్టణంలో త్వరలో డిజిటల్ సెన్సార్ డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు రాయలసీమ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (జేటీసీ) బసిరెడ్డి తెలిపారు. రవాణాశాఖ స్థానిక కార్యాలయాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవింగ్ కచ్చితంగా ఉంటేనే లైసెన్సు ఇస్తామన్నారు. ఇందుకోసం సెన్సార్ ట్రాక్‌ను రూపొందిస్తున్నామన్నారు. ఇది త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. టెండర్లు కూడా పూర్తయ్యాయన్నారు. ధర్మవరంలో మోటారు వాహనాల యూనిట్ కార్యాలయం త్వరలో సిద్ధం కానుందని ఆయన చెప్పారు. మున్ముందు వాహనాల ఫిట్‌నెస్ కూడా యంత్రాల ద్వారా పరీక్షిస్తారన్నారు. విద్యార్థులను తరలించే విద్యాసంస్థల వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఫిట్‌నెస్ కచ్చితంగా ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీటీసీ కరుణాసాగర్‌రెడ్డి, ఎంవీఐలు వరప్రసాద్, రాణి, శివశంకర్, ఏఎంవీఐ జయశ్రీయాదవ్ పాల్గొన్నారు.

పనిచేయించుకుని డబ్బులివ్వలేదు [illegible]



ఆవేదన వ్యక్తం చేస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

పుట్టపర్తి, జూలై 8: [illegible]

సంపత్ హత్య కేసు నిందితులను అరెస్టు చేయాలి

[illegible] జాతీయ నేత సంప[illegible]మార్ హత్య కేసు నిందితులను 24 గంటల్లోగా అరెస్టు[illegible] మాజీ ఎంపీ హర్ష[illegible]



మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

హిందూపురం అర్బన్, జూలై 8: న్యాయవాది, ఎస్ఎస్‌యూ [illegible] కోసం పనిచేసిన సంపత్ కుటుంబాన్ని పార్టీ నేతలు పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సంపత్ తండ్రి రాజశేఖర్ పాల్గొన్నారు.

సౌకర్యాలున్నా..

వైద్యం సున్నా..

హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి



పురం ఆస్పత్రిలో చోద్యం

డెంటల్ ల్యాబ్ ఉన్నా అందని చికిత్సలు

అవగాహనలేని సిబ్బందితో తిప్పలు

రోగులను బయటకు పంపాల్సిన దుస్థితి


హిందూపురం అర్బన్, జూలై 8: ఉమ్మడి అనంత జిల్లాలో స్థానిక జిల్లా ఆస్పత్రి ఎంతో ప్రత్యేకం. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన నందమూరి తారకరామారావు, ఆయన వారసుడు, ప్రస్తుత ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆస్పత్రి అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిచ్చారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎన్నో అధునాతన సౌకర్యాలు కల్పించారు. బాలయ్య చొరవ తీసుకుని, రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా హిందూపురంలో డెంటల్ ల్యాబ్ ఏర్పాటు చేయించారు. దంత చికిత్సల నిమిత్తం ఎక్స్‌రే యంత్రాన్ని కూడా తెప్పించారు. వీటి ద్వారా దంతాలను కట్టవచ్చు. అన్ని దంతాలను ప్రైవేటు ఆస్పత్రుల్లో కట్టించుకోవాలంటే రూ.30 వేలకుపైగానే ఖర్చు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా కట్టుడు దంతాలు అందిస్తున్నారు. డెంటల్ ఎక్స్‌రే యంత్రం ఉన్నా.. ఎక్స్‌రే తీసి దానిని డెవలప్ చేయడానికి అవసరమైన లిక్విడ్ లేదు. టెక్నీషియన్లు కూడా లేరు. దీంతో ఎక్స్‌రే యంత్రం మూలన పడేశారు. ప్రభుత్వం ఇద్దరు టెక్నీషియన్లను నియమించింది. వారిలో కాంట్రాక్టు ప్రాతిపదికన తీసుకున్న ఒకరికి దీనిపై అవగాహన లేదని తెలుస్తోంది. మరొకరిని నేషనల్ హెల్త్ మిషన్ కింద తీసుకున్నారు. ఆయనకు కట్టుడు పళ్లమీద అవగాహన ఉందని సమాచారం. ఆయనను కాకుండా అవగాహన లేని వ్యక్తిని నియమించడం వెనుక ఆంతర్యమేమిటో పెరుమాళ్లకే ఎరుక. పని రాక ఒకరు, పని వచ్చినా అది తన బాధ్యత కాదని మరొకరు ఉంటుండడంతో రోగులకు సేవలు దూరమయ్యాయి. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

తప్పని రెఫర్లు..

సౌకర్యాలున్నా టెక్నీషియన్లు లేక దంత సమస్యలతో వచ్చే వారిని కట్టుడు దంతాలకు బయటకు రెఫర్ చేస్తున్నారు. ప్రైవేటులో వైద్యం చేయించుకోవాలంటే రూ.వేలల్లో వెచ్చించాల్సి వస్తోంది. ఇది పేదలకు భారంకానుంది. కొంతమంది అంత స్తోమత లేక నొప్పిని భరిస్తూ అలాగే ఉంటున్నారు. మరికొందరు నాటు వైద్యం చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. మరికొందరైతే అప్పులు చేసి బయట చికిత్సలు పొందుతున్నారు. కేవలం రూ.3000 ఖర్చు చేస్తే 150 మందికి ఎక్స్‌రే తీయవచ్చు కానీ, డెవలప్‌మెంట్ సర్వీసు లేక యంత్రాలు మూలనపడి ఉన్నాయి.

రోజూ 40 మందిదాకా ఓపీకి..

హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి ఓపీకి రోజూ 40 మంది దాకా దంత సమస్యలతో వస్తుంటారు. వారికి ఎక్స్‌రే, కట్టుడు పళ్ల సమస్యలు ఉంటే బయటకు పంపాల్సిన పరిస్థితి దాపురించింది. అన్నిరకాల దంతాలు, పరికరాలు ఉన్నా వాటిని అమర్చేవారు లేక ప్రజలు బయటకు వెళ్తున్నారు. ఇక్కడ టెక్నీషియన్లు లేరనే నెపంతో బయట ఫోన్ నంబర్ ఇచ్చి అక్కడకు పంపుతున్నట్లు ఆస్పత్రి వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఒక్క హిందూపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డెంటల్ క్లినిక్ ల్యాబ్ ఉంది. మొదట్లో దంత వైద్యసేవలు బాగానే అందాయి. 18 నెలల నుంచి సేవలు బంద్ అయ్యాయి.



నిరుపయోగంగా పడివున్న డెంటల్ ఎక్స్‌రే యంత్రం



సిద్ధంగా ఉన్న కట్టుడు దంతాలు

పంటి నొప్పి వస్తే రెఫర్ చేశారు



పంటి నొప్పి తీవ్రంగా ఉంది. ఆస్పత్రికి వస్తే వైద్యుడు పరిశీలించి ఎక్స్‌రే కోసం బయటకు రాసిచ్చారు. బయట ఎక్స్‌రే తీయించుకోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని. నా దగ్గర డబ్బులేదు. ఏంచేయాలో పాలుపోవడంలేదు.

- సునీత, హిందూపురం

టెక్నీషియన్లను నియమిస్తే బాగుంటుంది

బయట దంతాలు కట్టించుకోవాలంటే రూ.30 వేలదాకా ఖర్చవుతుంది. దంతాలు అమర్చే టెక్నీషియన్‌ను ప్రభుత్వం నియమిస్తే ఆస్పత్రిలో ఉచితంగా అమర్చవచ్చు.

- భూపాలం విజయ్‌బాబు, దంత వైద్యుడు

పేదలకు వరం.. ఉచిత ఇసుక

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, జూలై 8: ఇల్లు నిర్మించుకునే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచిత ఇసుక విధానం.. వరమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక విధానం అమలు చేయడం హర్షణీయమన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన కీలక హామీని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నెల తిరక్కనే అమలు చేయడం ఎంతో సాహసోపేతమైందన్నారు. ఉచితంగా ఇసుక ఇవ్వడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలతోపాటు భవన నిర్మాణ కార్మికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ పద్ధతిలో చెల్లింపులు సాగిస్తే అక్రమాలకు ఆస్కారం ఉండదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని దొరుకుతుందన్నారు. నిర్మాణరంగం పరుగులు పెడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అధికారికంగా నిర్వహించండి..!



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎరుకల సంఘం నాయకులు

పుట్టపర్తి: తమ ఆరాధ్యదైవం ఏకలవ్యుడి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎరుకల సంఘం నాయకుడు సాకే గోవిందు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. నినాదాలు చేశారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థిని అదృశ్యం

పెనుకొండ రూరల్, జూలై 8: దుద్దేబండ గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని కీర్తన అదృశ్యమైందని కియ స్టేషన్ ఎస్ఐ రంగడు సోమవారం తెలిపారు. ఈనెల 3న పెనుకొండలోని కాలేజీకి వెళ్లిన కీర్తన తిరిగి రాలేదని, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదని విద్యార్థిని తండ్రి ఈరన్న, సోదరుడు నాగరాజు తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రామగిరి మండలానికి చెందిన వీరన్న కుటుంబం కొన్నిరోజుల క్రితం దుద్దేబండకు వలస వచ్చిందని ఆయన తెలిపారు.



టెంపోలో రైతులు తీసుకువచ్చిన ట్రాన్స్‌ఫార్మర్

ఈ వాహనంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కణేకల్లు మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతుది. ఇరవైరోజుల కిందట ఉరుములకు ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. రైతులు క్షేత్ర స్థాయిలోని అధికారులకు సమాచారం ఇచ్చారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో సదరు రైతు ఓ టెంపోలో ఐదురోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను అనంతపురంలోని మరమ్మతుల కేంద్రానికి తీసుకువచ్చారు. ఇందుకు బాడుగ రూపంలో రైతుకు రూ.2వేలు ఖర్చు అయింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది సకాలంలో స్పందిచని కారణంగా వరి పంటసాగు కోసం పోసిన ఫైరు దెబ్బతినింది. దీనివల్ల రైతుకు రూ.8వేలు నష్టం వాటిల్లింది. మరమ్మతుల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మార్చి ఇచ్చినందుకు మరో రూ.5 ఇచ్చుకున్నాడు. సదరు రైతు తన వద్ద ఉన్నది రూ.3వేలే అని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో మరో వ్యక్తితో రూ.2వేలు ఫోన్‌పే చేయించాడు. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ మర్మతులకు గురైతే విద్యుత్ శాఖ వాహనాల ద్వారా తరలించాల్సి ఉంది. క్షేత్ర స్థాయిల్లో సంబంధిత అధికారులు స్పందించని కారణంగా రైతులే మరమ్మతుల కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి.



ఈ చిత్రం నార్పల మండలం చామలూరు గ్రామంలోనిది. ఫ్యూజులు పోవడంతో రైతే విద్యుత్ సిబ్బందితో ఎల్‌సీ తీసుకుని ఫ్యూజులు తగిలించుకున్నాడు. సాధారణంగా లైన్‌మన్ ఎల్‌సీ తీసుకుని విద్యుత్ స్తంభాలు ఎక్కి ఫ్యూజులు మార్చాల్సి ఉంది. ఈ పని రైతే చేసుకోవడం గమనార్హం. ఈ క్రమంలో జరగరానిది ఏమైనా జరిగితే బాధ్యులు ఎవరని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సంఘనలు క్షేత్రస్థాయిలో కోకొల్లలుగా జరుగుతున్నాయి. సంబంధిత అధికారుల్లో చలనం లేకుండా పోయింది.



ట్రాన్స్‌ఫార్మర్ల కష్టాలు..!

- విద్యుత్ శాఖకు నిర్లక్ష్యపు జబ్బు
- మరమ్మతుల్లో అంతులేని అలసత్వం
- రోజుల తరబడి ఎదురుచూపులు
- సకాలంలో స్పందించని క్షేత్రస్థాయి ఉద్యోగులు
- రైతులకు తడిసిమోపెడు ఖర్చు

అనంతపురంరూరల్, జూలై 8: విద్యుత్ శాఖకు నిర్లక్ష్యపు జబ్బు చేసింది. ముఖ్యంగా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో విద్యుత్ శాఖ అంతులేని అలసత్వం ప్రదర్శిస్తోంది. రోజుల తరబడి మార్పు కోసం సమయం పడుతుండటంతో వినియోగదారులకు, రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ముఖ్యంగా రైతుల రైతుల పరిస్థితి మరీ దయనీంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ల మార్పుల్లో నెలకొన్న జాప్యం కారణంగా పంటకు సకాలంలో నీరు అందించలేక రైతులు అవస్థలు పడుతున్నారు. క్షేత్రస్థాయిలోని అధికారులు, ఉద్యోగులు స్పందించకపోవడంతో రైతులే స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్లను ప్రైవేట్ వాహనాల్లో తీసుకువచ్చి మార్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా రైతులకు రవాణా చార్జీల భారం పడుతోంది. వేలరూపాయలు ఖర్చవుతోంది. ఇందుకు పైఉదాహరణ నిదర్శనం.

ఉమ్మడి జిల్లాలో 1.94 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు..

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఆరు డివిజన్లలో 1.94 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అందులో త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు 1,76,693 ఉండగా..సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు 17,970 ఉన్నాయి. ఉమ్మడి జిల్లా మొత్తంగా 1,94,663 ఉన్నాయి. కాగా గత నెలలో 800పైగా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైనట్లు సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నా అధికారులు పట్టించుకోలేదు. క్షేత్రస్థాయిలోని ఉద్యోగులు సమస్యలను పెడచెవిన పెడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. రైతులు, వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడల్సిన సంబంధిత అధికారి సమస్యలను తెలుసుకుని సమన్వయం చేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తప్పని నిరీక్షణ

పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చుకునేందుకు రైతులకు, వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ పాడైతే పట్టణాల్లో 24గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 48 గంటల్లో ఆ స్థానంలో మరొకటి ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయిలో శాఖ అధికారులు, ఉద్యోగులు ఆ దిశగా పనిచేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రోజుల తరబడి పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం లేదని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని స్థానిక అధికారులకు చెబుతున్నా సకాలంలో స్పందిచలేదని రైతులు అంటున్నారు.

23 మరమ్మతు కేంద్రాలు..

ఉమ్మడి జిల్లాలో 23 మరమ్మతు కేంద్రాలు ఉన్నాయి. అందులో విద్యుత్ శాఖకు సంబంధించినది ఒకటి కాగా, మరో తొమ్మిది విద్యుతుశాఖ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఉన్నాయి. ప్రైవేట్‌కు సంబంధించి మరో 10 మరమ్మతు కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క కేంద్రంలో 3 నుంచి 4 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు కావాల్సి ఉంది. ప్రస్తుతం ఒక్కొక్క కేంద్రంలో రెండు రోజులకు మూడునాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు మించి మరమ్మతులు పూర్తి కాలేదని తెలుస్తోంది. సంబంధిత అధికారులు చొరవ చూపలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సొంత డబ్బుతో రవాణా

విద్యుత్‌శాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులే సొంత డబ్బులు పెట్టుకుని మరమ్మతుల కేంద్రాలకు తీసుకువస్తున్నారు. పాడైన వాటిని తరలించేందుకు సంస్థలో ప్రతి సబ్ డివిజన్‌లోను ప్రత్యేకంగా వాహనాలు ఉన్నాయి. ఆ వాహనాల్లో విద్యుత్ సిబ్బంది తీసుకొచ్చి.. వాటి స్థానంలో మరొకటి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ పనిని ఆ శాఖ ఉద్యోగులు వదిలేశారు. విధిలేక రైతులు, వినియోగదారులే ఆటోలు, టెంపోలు, ఐచర్ వంటి వాహనాల్లో మరమ్మతు కేంద్రాలకు తీసుకువచ్చి మార్చుకుని వెళుతున్నారు.

సకాలంలో మరమ్మతులు చేస్తున్నాం

గతంలో కంటే ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు తగ్గాయి. సీజన్‌లో మాత్రమే ఎక్కువగా రిపేర్లకు వస్తున్నాయి. ఆ మేరకు పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేయిస్తున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

- ఈశ్వర్‌రెడ్డి, ఈఈ, ట్రాన్స్‌ఫార్మర్స్

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 8: నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 60రోజుల పాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సులలో నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివి 20-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణాకాలంలో మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు వివరాలు, పేర్ల నమోదుకు 73 96950345, 7780752418లను సంప్రదించాలని కోరారు.

రేపు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్, జూలై 8: వినూత్న(నవభారత్ ఫర్టిలైజర్స్) ప్రైవేట్ సంస్థలో సేల్స్ రెప్రజెంటెటివ్స్ ఉద్యోగాలకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యనభ్యసించిన 18నుంచి 35 సంవత్సరాల్లోపు వయసుగల యువకులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో 10న నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లను తీసుకురావాలని కోరారు. వివరాలకు 08554-245547 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగమేళా

అనంతపురం సెంట్రల్, జూలై 8: ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో 10న నిర్వహించే ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఐసీఐసీఐ బ్యాంక్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. డిగ్రీలో 50శాతం మార్కులు సాధించిన 26 సంవత్సరాల వయసులోపు యువతీ, యువకులు అర్హులన్నారు. వివరాలకు జేకేసీ కోఆర్డినేటర్ వెంకటేసులు 9704926192 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

చీనీ కాయలు టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్, జూలై 8: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 985టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, జూలై 8: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30 పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డుకార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం మార్కెట్‌కు 150టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.17తో పలికినట్లు ఆయన తెలిపారు.

ఎఫ్‌బీఓలకు ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, జూలై 8: జిల్లా అటవీశాఖ పరిధిలో అర్హత కలిగిన ఇద్దరు ఎఫ్‌బీఓ (ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్)లకు ఎఫ్ఎస్ఓ(ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్)గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వడ్డుపల్లి బీట్ ఆఫీసర్‌గా ఉన్న దామోదర్‌కు గాండ్లపెంట ఎఫ్ఎస్ఓగా ప్రమోషన్ ఇచ్చి బదిలీ చేశారు. పెనుకొండ రేంజ్‌లోని కొండపల్లి బీట్ ఆఫీసర్‌గా ఉన్న మల్లికార్జునకు ఎఫ్ఎస్ఓగా ఉద్యోగోన్నతి కల్పించి కళ్యాణదుర్గం రేంజ్‌లోని కంబదూరుకు బదిలీ చేశారు.

మొక్కలు నాటి సంరక్షించండి

అధికారులకు కలెక్టరు ఆదేశాలు



అనంతపురం టౌన్, జూలై 8: లక్ష్యం మేరకు జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టరు వినోద్ కుమార్ అధికారుల ను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం అన్నిశాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో పది లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, శాఖల వారీగా ఇచ్చిన లక్ష్యం మేరకు ఈ మొక్కలను తీసుకెళ్లి నాటించడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పోస్టర్లను ముద్రించి ప్రదర్శించాల న్నారు. రాబోయే రోజుల్లో ఏఏ కార్యక్రమాలు ఎపుడు నిర్వహించాలో వాటి జాబితాను తయారుచేసి, ఆ పథకాలు గురించి ప్రచారం చేయాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి ఎప్పటికపుడు సమీక్షించుకొని వాటి పరిష్కారా నికి కృషి చేయాలన్నారు. రెడ్‌క్రాస్ సంస్థలో ప్రతి ఒక్కరు శాశ్వత సభ్యత్వం తీసుకోవాల న్నారు. ఈనెల 31నాటికి సామూహిక ఉద్యోగ విరమణ పొందేవారితో పాటు ఆగస్టు, సెప్టెంబరు నెలలో ఉద్యోగ విరమణ పొందే వారి పెన్షన్ ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలన్నారు. అన్నిశాఖల పరిధిలోనూ కిందిస్థాయి ఉద్యోగులకు వచ్చేవారం ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గ్రేడ్ ప్రమోషన్‌లు అందించే కార్యక్రమం చేపట్టాలని కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్‌తో పాటు వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ సమావేశం

అనంతపురం విద్య, జూలై 8: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభంకానుంది. ముఖ్యంగా సర్వసభ్య సమావేశం అజెండాలో ప్రధానంగా 6 అంశాలను ఉంచారు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలపై ప్రభుత్వ శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలకు తెలియజేయడం, జిల్లా అధికారులు సమర్పించిన ప్రగతి నివేదికపై సమీపక్ష, తీర్మానాలు తదితర అంశాలను అజెండాలో పొందుపర్చారు. కొత్త ప్రభుత్వంలో తొలి మీటింగ్ కావడంతో ఉత్కంఠ నెలకొంది.

కొనసాగుతున్న వరద

టీబీ డ్యాంలో 20 టీఎంసీల నీరు



టీబీ డ్యాంలో నీటి నిల్వ

బొమ్మనహాళ్, జూలై 8: ఆంధ్ర, కర్ణాటక జీవనాడి తుంగభద్ర జలాశయానికి 20.851 టీఎంసీల నీరు చేరింది. ఇన్‌ఫ్లో తగ్గింది. ఆదివారం 50,715 క్యూసెక్కులు ఉండగా సోమవారం ఉదయానికి 30,388 క్యూసెక్కులకు తగ్గింది. ఔట్‌ఫ్లో 156 క్యూసెక్కులున్నట్లు అధికారులు వెల్లడించారు. ముందస్తుగానే జలాశయం నుండి ఎగువ కాలువకు నీరు విడుదల అవుతాయన్న ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

బొలెరో బోల్తా.. 16 మందికి గాయాలు



బోల్తాపడిన వాహనం



బాధితులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్



నారాయణమ్మ



శ్రావణి



దస్తగిరమ్మ



లక్ష్మీ



పెద్దక్క



డ్రైవర్‌ను ఆరాతీస్తున్న ఎస్ఐ

ప్రమాదంపై ఆరాతీసిన మంత్రి సత్యకుమార్

పరామర్శించిన పరిటాల శ్రీరామ్

బత్తలపల్లి, జూలై 8: మండలంలోని మాల్యవంతం సమీపంలో సోమవారం బొలెరో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 16 మంది గాయపడ్డారు. తాడిమర్రి మండలం నారసింపల్లెకు చెందిన కూలీలు చీనీకాయలు కోసేందుకు బొలెరోలో నార్పల సమీపం వెళ్లారు. తిరిగి వస్తుండగా.. మాల్యవంతం సమీపంలోని పెట్రోల్ బంకు ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి బొలెరో వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ధనలక్ష్మి, నారాయణమ్మ, వన్నురమ్మ, నాగేంద్రమ్మ, డ్రైవర్ గోవర్దన, లక్ష్మినారాయణమ్మ, లక్ష్మి, కుల్లయప్ప, శ్రావణి, జయశ్రీ, నారాయణమ్మ, దస్తగిరమ్మ, పెద్దక్క, పార్వతి, స్వాతి, లక్ష్మిదేవి గాయపడ్డారు. వీరిని 108లో బత్తలపల్లి ఆర్‌డీటీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ధనలక్ష్మి, నారాయణమ్మ, వన్నురమ్మ, నాగేంద్రమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

మంత్రి సత్యకుమార్ ఆరా

వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ తన కార్యాలయ సిబ్బందిని హరీష్, మల్లి, షరీఫ్‌ను ఆర్డీటీ ఆసుపత్రికి పంపి.. గాయపడ్డ వారి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారిని టీడీపీ నాయకులు ఘంటాపురం జగ్గు, చల్లా శ్రీనివాసులు, తాళ్ళూరి సతీష్, నారాయణస్వామి, అశోక్ పరామర్శించారు.

పరిటాల శ్రీరామ్ ఆర్థికసాయం

తాడిమర్రి: చీనీకాయలు కోసేందుకు వెళ్లివస్తూ బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామం వద్ద బోలోరా బోల్తాపడిన ఘటనలో గాయపడిన తాడిమర్రి మండలం నార్శింపల్లి గ్రామానికి చెందిన వారిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. చికిత్స పొందుతున్న వారికి ఆర్థిక సాయం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎవరూ అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ఎల్ నరేంద్రచౌదరి, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

మా ఊళ్లో చిచ్చుపెట్టొద్దు

తలారి రంగయ్యను అడ్డుకున్న టీడీపీ శ్రేణులు

కుందుర్పి, జూలై 8: ప్రశాంతంగా ఉన్న తమ గ్రామంలోకి వచ్చి రాజకీయ చిచ్చు పెట్టవద్దని మాజీ ఎంపీ తలారి రంగయ్యను టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో కుందుర్పి మండలం మలయనూరులో గత నెల 8న పార్టీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించాయి. ఆ సమయంలో ఎలాంటి దాడి జరగకపోయినా.. అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త లక్ష్మీకాంత్ ఉద్దేశ పూర్వకంగా దాడి జరిగిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని వారు అన్నారు. లక్ష్మీకాంత్‌ను పరామర్శించేందుకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి రంగయ్య సోమవారం సాయంత్రం గ్రామానికి వచ్చేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు, గ్రామస్థులు ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. తలారి రంగయ్య గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని తలారి రంగయ్యను వెనక్కి పంపేందుకు ప్రయత్నం చేశారు. ఆయన వెనుదిరిగి వెళ్లకపోవడంతో గ్రామంలో ఉద్రిక్తత ఏర్పడింది. దీంతో పోలీసులు ఆయనను బలవంతంగా వెనక్కు పంపారు. తమను అక్రమంగా అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని వైసీపీ వర్గీయులు ఆరోపించారు.



గ్రామంలోకి వస్తున్న తలారి రంగయ్య, వైసీపీ నాయకులు

మహిళల పట్ల అసభ్యంగా ప్రవరిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

అనంతపురం టౌన్, జూలై 8: పనిచేసే ప్రాంతంలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే అంతర్గత కమిటీలు ప్రతిచోట ఉండాలన్నారు. శరీరాన్ని తాకడం, శారీరకంగా కలవాలని అభ్యర్థించడం లేదా బలవంతం చేయడం, శృంగారపరమైన చర్యలు, సంభాషణలు, కామెంట్స్, సైగలు చేస్తూ మానసికంగా వేధించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ద్వంద్వార్థాలుమాట్లాడటం, ఆత్మగౌరవం దెబ్బతినేలా ప్రవర్తించడం కూడా లైంగిక వేధింపులకిందకు వస్తుందన్నారు. ఎక్కడా మహిళలు, ఆడపిల్లలు పట్ల వేధింపులు జరగకుండా చూడటానికి రెండు కమిటీలు ఉండాలన్నారు. కమిటీలను నిబంధనల మేరకు ఎన్నుకోవాలన్నారు. 181, ఎమర్జెన్సీ112, పోలీస్100 సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకోండి

ఏపీయూడబ్ల్యూజే

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 8: జిల్లాలో జర్నలిస్టులు తమ పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్య పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. అక్రెడిటేషన్ పొందిన జర్నలిస్టులు తమ అక్రెడిటేషన్ కార్డు జిరాక్స్‌తో పాటు విద్యార్థి ఆధార్ కార్డు, స్కూల్ పేరు తదితర వివరాలతో ఏపీయూడబ్ల్యూజే నేతలను కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 15లోగా జర్నలిస్టుల వివరాలు స్థానికంగా ఉన్న యూనియన్ నేతలకు అందజేయాలన్నారు. అనంతపురం నియోజకవర్గంలో జర్నలిస్టులు విశాలాంధ్ర రిపోర్టర్ మల్లికార్జున శర్మ, తాడిపత్రి నియోజకవర్గంలోని జర్నలిస్టులు హెచ్ఎంటీవీ రిపోర్టర్ రంగనాయకులు, గుంతకల్లు నియోజకవర్గంలో జర్నలిస్టులు ఆంధ్రజ్యోతి ఇన్‌చార్జ్ మహమ్మద్ రఫీకి, ఉరవకొండ నియోజకవర్గంలోని జర్నలిస్టులు ఆంధ్రజ్యోతి రిపోర్టర్ రమేష్, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని జర్నలిస్టులు వెటరన్ జర్నలిస్టు లింగప్రసాద్, రాయదుర్గం నియోజకవర్గంలోని జర్నలిస్టులు వార్త ఇన్‌చార్జ్ కమలాక్షుడు, శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల రిపోర్టర్లు అనంతపురం నేతలను కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

ధర్మవరం, జూలై 8: ధర్మవరం ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ఉంటుందని, ప్రజలు నేరుగా 99592 25859కు ఫోన్ చేసి తనకు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

రేపు జాబ్‌మేళా

ధర్మవరం, జూలై 8: పట్టణంలోని శ్రీనివాస పీజీ, డిగ్రీ కళాశాలలో టీవీఎస్, టీఎస్ ఆధ్వర్యంలో ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతినిధులు బుధవారం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ముసల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాను ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభిస్తామని, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే విద్యార్థులు వారి బయోడేటాను తీసుకురావాలన్నారు.

11న గుండె, కంటి వైద్యశిబిరం

నల్లచెరువు, జూలై 8: స్థానిక షిర్డిసాయి ఆలయలో గురువారం గుండె, కంటి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ ఆలయ కమిటీ సభ్యుడు రవిశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో గుండె, ఛాతినొప్పి, గుండె దడ, ఆయాసం, కాళ్ల వాపురావడం, చెమటలు పట్టడం తదితర వ్యాధులకు చికిత్సలు అందిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బత్తలపల్లి, జూలై 8: మండలంలోని ముష్టూరు క్రాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముస్టూరు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ (50) అక్కడికక్కడే మరణించాడు. ఇతను ఆర్డీటీ ఆసుపత్రిలో సెక్యూరిటీగా విధులు నిర్వహించేవాడు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం ముస్టూరు నుంచి బత్తలపల్లికి వస్తుండగా.. ముస్టూరు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న కారు ఢీ కొంది. దీంతో లక్ష్మీనారాయణ అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది. లక్ష్మీనారాయణకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

భార్యను చంపిన భర్త ఆత్మహత్య

బత్తలపల్లి, జూలై 8: మండలంలోని తంభాపురం గ్రామానికి చెందిన లక్ష్మమ్మను భర్త లక్ష్మన్న ఈ నెల ఆరో తేదీన రాయితో కొట్టి.. హత్య చేసి పరారయ్యాడు. మండలంలోని చిన్నయకుంట పల్లి రైల్వే స్టేషన్ సమీపంలో తిరుపతికి వెళ్లే రైలు కింద ఆదివారం రాత్రి పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ వెంకటేసు సోమవారం తెలిపారు. లక్ష్మన్నకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, కేసు దర్యాప్తులో ఉందని చెప్పారు.

కుక్కల దాడిలో 24 గొర్రెపిల్లల మృతి



మృతిచెందిన గొర్రెపిల్లలు

తాడిమర్రి, జూలై 8: మండలంలోని ఏకపాదంపల్లి గ్రామానికి చెందిన తెనికలపాటి శివయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రెపిల్లల మందపై వీధి కుక్కలు సోమవారం దాడిచేశాయి. 24 గొర్రెపిల్లలను చంపేశాయి. శివయ్య తనకు సంబంధించి మందలోని గొర్రెపిల్లలను తనఇంటి వద్ద కంచెలో వేసి గొర్రెల మేపుకొని రావడానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి గొర్రెపిల్లలపై కుక్కలు దాడి చేసి.. చంపేసినట్లు గుర్తించాడు. దీంతో తమనకు దాదాపు రూ.70 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని శివయ్య విజ్ఞప్తి చేస్తున్నాడు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం, జూలై 8: సచివాలయానికి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాలని 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు సిబ్బందికి సూచించారు. పట్టణంలోని 25వ వార్డు సచివాలయంలో సిబ్బందితో ఆయన సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలు వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వస్తుంటారని, వారిని సచివాలయం చుట్టు తిప్పకుండా వెంటనే సమస్య పరిష్కరించేలా చూడాలని అన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అందించే పథకాలను అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బోలేబాబాను అరెస్టు చేయాలి

ధర్మవరం, జూలై 8: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ తొక్కిసలాటలో 125 మంది అమాయకుల మరణానికి కారణమైన బోలేబాబాను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు సోమవారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల రెండో తేదీన బోలేబాబా ప్రవచనాలు వినడానికి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి దాదాను రెండు లక్షల మంది హాజరయ్యారని, ప్రవచనాలు ముగిసిన తరువాత బోలేబాబా పాదధూళి కోసం జనం ఎగబడ్డారని అన్నారు. ఆ తోపులాటలో ఇప్పటికే 125 మంది మరణించగా... మరో 200 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు. కావున బోలేబాబాను అరెస్టు చేయాలని కోరారు.

శానిటేషన్ సామగ్రి అందజేత

కొత్తచెరువు, జూలై 8: కొత్తచెరువు మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న 22 మంది పంచాయతీ కార్మికులకు శానిటేషన్ సామగ్రిని సర్పంచ్ రాదానాగరాజు, పంచాయతీ కార్యదర్శి సురేంద్రరెడ్డి సోమవారం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ... పంచాయతీ కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సబ్బులు, కొబ్బరినూనె, ఇతర వస్తువులు అందజేస్తామన్నారు.

ఎంపీపీ రాజీనామా..!

గాండ్లపెంట, జూలై 8: మండల ఎంపీపీ తాతం జగన్మోహన్ రాజీనామా చేసినట్లు సోషియల్ మీడియాలో సోమవారం హల్‌చల్ చేసింది. మండలంలో 2021 సెప్టెంబరులో ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. తాను ఎవరి ప్రమేయమూ లేకుండా రాజీనామా చేస్తున్నాని, తన రాజీనామా పత్రాన్ని జిల్లా పరిషత్ సీఈఓకు అందచేస్తున్నట్లు సోషియల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై స్పష్టత కోసం ఎంపీపీని ఫోన్ ద్వారా ప్రయత్నించగా... ఆయన అందుబాటులోకి రాలేదు.



వైరల్ అవుతున్న ఎంపీపీ రాజీనామా పత్రం

ఏకలవ్య జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

ధర్మవరం రూరల్, జూలై 8: ఏకలవ్య జయంతిని ఈనెల 17న ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఎరుకుల ప్రజాపోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సాకే కదిరన్న సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఎన్నోఏళ్లుగా పోరాటాలు చేస్తున్నామని, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఈ విషయంపై స్పందించాలని కోరారు.

హంద్రీనీవాను పరిశీలించిన ఎమ్మెల్యే

వైసీపీ నిర్లక్ష్యం వల్లే జాప్యమని విమర్శలు





తలుపుల మండలంలో టన్నెల్ పరిశీలించదానికి వెళ్తున్న ఎమ్మెల్యే కందికుంట, కుటాగుళ్ల వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కదిరి, జూలై 8: హంద్రీనీవా సుజల శ్రవంతి మెయిన్ బ్రాంచ్ కెనాల్ కాలువను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. నాలుగు మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలువ గట్లు వెంబడి అడుగడుగనా పరిశీలించారు. ముదిగుబ్బ మండలంలోని నాగారెడ్డిపల్లి వద్ద ఉన్న మెయిన్ బ్రాంచ్ కెనాల్, పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించారు. తలుపుల మండలంలోని సబ్బనగుంతపల్లికి సమీపంలో ఉన్న మూడు కిలోమీటర్ల టన్నల్‌ను (గృహ) పరిశీలించారు. అక్కడ నుంచి తలుపుల మండలంలోని ఓబీఆర్ తండా వద్ద ఉన్న మరో టన్నల్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు మురళీ, గణేనాయక్, డీఈలు ప్రసాద్‌రావు, విశ్వనాథ్, లక్ష్మీదేవి, ఏఈలు కైలాస్, హరి, పాండురంగ, అశోక్, శ్రీధర్, చామంతి, టీడీపీ నాయకులు ఉన్నారు.

వైసీపీ నిర్లక్ష్యం వల్లే జాప్యం

గత పాలకుల నిర్లక్ష్యంతోనే హంద్రీనీవా సజల శ్రవంతి పథకం అసంపూర్తిగా ఉందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. హంద్రీనీవా కాలువలను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హంద్రీనీవా రెండవ ఫేస్‌లో కదిరి నియోజకవర్గానికి రూ.650 కోట్లు కేటాయించారన్నారు. అందులో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రాబాబు నాయుడు రూ.600 కోట్లుకుపైగా ఖర్చు చేశారని, కేవలం రూ.43 కోట్లను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఖర్చు పెట్టకపోవడంతో ఈ ప్రాంతానికి నీరు అందలేదన్నారు. ఆయనకు పక్కనే ఉన్న నియోజవర్గం ఇష్టమని చెప్పారు. అధికారులు, కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకుని పనులు చేసి ఉంటే, ఎప్పుడో ఎన్పీకుంట వరకు నీళ్లు వచ్చేవన్నారు. త్వరలోనే ఈ పనులు చేపడతామన్నారు. ప్రతి చెరువుకూ నీరందించి, రైతులకు ఆదుకుంటామన్నారు. పూర్తిగా ప్రణాళికలు తయారైన తరువాత పనులు ప్రారంభిస్తామన్నారు. తలుపుల మండలంలో ఉన్న లక్కసముద్రం, ఎన్పీకుంట మండలంలోని ధనియాన్‌చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్‌తో నీరు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్ఎండీ ఇస్మాయిల్, జనసేన నాయకురాలు సత్యవతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తలుపుల మండలంలోని రెడ్డివారిపల్లిలో తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యేకు మహిళలు చెప్పగా... వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఫోనులో చర్చించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దోబీఘాట్ ఏర్పాటు చేయాలని రజకులు కోరగా.. దాన్ని వెంటనే ఏర్పాటు చేయా లని అధికారులను ఆదేశించారు. ఎన్పీకుంట మండలంలోని గోపాలపు రంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో డీఈకి సూచించారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక

కదిరిఅర్బన్: పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. సోమవారం కుటాగుళ్ల వద్ద ఇసుక నిలువ ఉంచిన స్టాక్ పాయింట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వం సదుద్దేశంతో ఉచిత ఇసుక విధానాన్ని ప్రారంభించిందని, ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ పుల్లారెడ్డి, టీడీపీ నాయకులు గంగరాజు, క్రిష్ణమోహన్‌నాయుడు, ఇస్మాయిల్, రొద్దం బషీర్, కాటం మనోజ్ ఉన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం





నల్లమాడ, ముదిగుబ్బలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు, టీడీపీ నాయకులు

నల్లమాడ, జూలై 8: ఉచిత ఇసుక పథకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి టీడీపీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానిక బుట్టి నాగభూషణనాయుడు నివాసంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుట్ల రవీంద్ర, పల్లపు శ్రీరాములు, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, దుద్దుకుంట భువనేశ్వర్‌రెడ్డి, పల్లపు ప్రతాప్, రమీజా, బాలిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు చంద్రబాబు చిత్రపటానికి స్థానిక బస్టాండ్ కూడలిలో క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, పతిరెడ్డి, మహబూబ్‌పీరా, చికెన్ తిరుపాల్, గడ్డం మోహన్, వెంకటపతి, అంజనేయులు, రామయ్య పాల్గొన్నారు.

బుక్కపట్నం : స్థానిక తేరుకూడలిలో కూటమి నాయకులు, తాపీ మేస్త్రీలు, రైతులు, కూలీలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.



బుక్కపట్నంలో సంబరాలు చేసుకున్న టీడీపీ నాయకులు

ఇసుక రీచ్ పరిశీలన



ఉప్పలపాడు ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న మైనింగ్ ఏడీ



నల్లబోయినపల్లి క్రాస్‌లో స్టాక్ పాయింటును పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

ముదిగుబ్బ, జూలై 8: రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక పంపిణీ విధానాన్ని సోమవారం నుంచి ప్రారంభించారు. ముదిగుబ్బ మండలంలోని ఉప్పలపాడు ఇసుక రీచ్ వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మైనింగ్ ఏడీ రామ్మోహన్ రావు, ధర్మవరం ఆర్‌డీఓ వెంకట శివరామిరెడ్డి పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ సరస్వతి, వీఆర్‌ఓలు ఉన్నారు.

బత్తలపల్లి: మండలంలోని నల్లబోయినపల్లి క్రాస్‌లో ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆర్‌డీఓ వెంకటశివారెడ్డి పరిశీలించారు. సిబ్బందికి ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఇసుక కావాల్సిన లబ్ధిదారులకు టన్ను కేవలం రూ.277కే విక్రయించాలని సూచించారు. ఇందులో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా పంపిణీ చేయాలని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ శివశంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి ఉన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న ప్రబోధసేవాసమితి సభ్యులు

ధర్మవరం రూరల్, జూలై 8: మండలంలోని మల్కాపురం గ్రామంలో ప్రబోధసేవాసమితి హిందూజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా హిందూజ్ఞానవేదిక ధర్మవరం కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణాచారి మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో గురుపౌర్ణమి రోజున శ్రీకృష్ణుడుని జగద్గురువుగా భావించి గురుపూజ చేయా లన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు చంద్రశేఖర్, మోహన్‌కృష్ణ, భరత్‌కుమార్, బాలమ్మ, హేమలత, సుబ్బలక్ష్మీ, సునీత, శివమ్మ, కృష్ణవేణి, జయలక్ష్మీ, చందు, వాణి, హారిక పాల్గొన్నారు.

కేజీబీవీ పరిశీలన

పుట్టపర్తిరూరల్ : మండలంలోని జగరాజుపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలను జిల్లా ఎన్సీడీ, సీడీ, ఆర్‌బీఎస్కే ప్రోగ్రాం డైరక్టర్ డాక్టర్ నివేదిత సోమవారం పరిశీలించారు. అతిసార ప్రబలుతున్న నేపథ్యంలో విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆమె వెంట సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ నాగసుప్ర, జిల్లా ఎపిడమిక్ ఆరోగ్య కార్యకర్త పఠాన్ అజీజ్‌ఖాన్, ఆరోగ్యకార్యకర్తలు ప్రమీల, జయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నివేదిత

ఎరువుల దుకాణం తనిఖీ

తనకల్లు, జూలై 8: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో సోమవారం విజిలెన్స్ ఆధ్వర్యంలో పురుగు మందులు, ఎరువుల దుకాణాలపై దాడులు చేశారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పుంగనూరు శివకుమార్, వేల్లూరు జిల్లా విజిలెన్స్ ఎస్ఐ రజిత్‌కుమార్ ఈ దాడులు చేశారు. శ్రీసాయి చిన్నప్పరెడ్డి ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి, 7,400 మెట్రికట్ టన్నులు స్టాక్‌లో వ్యత్యాసమున్నట్లు గుర్తించారు. రూ.96,600 విలువైన ఎరువులను జప్తు చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రతి రైతు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని, ఎమ్మార్పీ రేటుకే అమ్మకాలు చేయాలని అన్నారు. ఎమ్మార్పీ రేటు కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ, ఏఓ శ్రీహరినాయక్, టెక్నికల్ అధికారి రవీంద్ర, పుట్టపర్తి ఏఓ, వీఆర్‌ఓ నజీర్‌అహమ్మద్, వీపీఏ చిన్నిక్రిష్ణ ఉన్నారు.



పార్టీ నాయకులతో సమావేశమైన పరిటాల శ్రీరామ్

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 8: పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొ న్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ ముఖ్య నాయకులతో నిర్వహిం చిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలను గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి... పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. నెలాఖరులోగా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనర్హులకు ఇస్తున్న సామాజిక పింఛన్‌లను తక్షణమే గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్హులకు న్యాయం చేసే విధంగా ప్రతి ఒక్కరూ వార్డుల్లో చొరవ చూపాలన్నారు. పట్టణంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 40 వేల కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామన్నారు. శివారు ప్రాంతాల్లోని కుటుంబాలకు ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి ఏర్పాటు చేస్తామన్నారు. నెలాఖరులోగా నిర్మాణంలో ఉన్న మూడు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, తాగునీటి పైపులైన్ పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటయయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, ఫణికుమార్, భీమనేని ప్రసాద్‌నాయుడు, సందారాఘవ, జింకా పురుషోత్తం, నాగూర్ హుస్సేన్, పురుషోత్తం గౌడ్, రాళ్లపల్లి షరీఫ్, మేకల, రామాంజనేయులు, కేశగాళ్ల శీనా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరిటాల శ్రీరామ్‌కు సన్మానం : బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పరిటాల శ్రీరామ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. రానున్న కాలంలో సమస్యలను అందరి సహకారంతో పరిష్కరించే విధంగా ముందుకెళ్తానన్నారు.

చుక్కల భూముల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ముదిగుబ్బ, జూలై 8: మండలంలో చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలంలో కొన్ని సంవత్సరాలుగా పట్టా భూములు చుక్కల జాబితాలో ఉన్నాయని, అది రిజిస్ట్రేషన్ కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గత వైసీపీ ప్రభుత్వంలో సమస్యను పరిష్కరించాలని అధికారులతో ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిప్పయ్య, కిష్టయ్య, రాధాకృష్ణ, శంకర పాల్గొన్నారు.

జీఓ నంబరు 117ను రద్దుచేయాలి : ఏపీటీఎఫ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్

బత్తలపల్లి, జూలై 8: రాష్ట్రంలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే జీఓ నెంబరు 117ను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వేలకుపైగా ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని, వేలాది పోస్టులు రద్దు అయ్యాయని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే 117 జీఓను రద్దు చేసి.. గతంలో మాదిరిగా ప్రాథమిక పాఠశాలలను ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగించాలన్నారు. పాఠశాలల విలీనాన్ని నిలిపివేయాలని, పాఠశాలలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. వివిధ రకాల యాప్‌లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బీకే ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు బలరాముడు, మండల శాఖ అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి నాగశేషన, నాయకులు నాగరాజు, తిమ్మప్ప, నాగేశ్వరయ్య, కిశోర్, హరికృష్ణ, మస్తాన్‌వలీ పాల్గొన్నారు.

ప్రధాన కూడలిలో గుంతలు



కొత్తచెరువు కూడలిలో ఏర్పడిన గుంతలు

కొత్తచెరువు, జూలై 8: స్థానిక నాలుగు రోడ్లకూడలిలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షం వచ్చినప్పుడల్లా నీరు నిల్వ ఉంటోంది. ప్రయాణికులు, ద్విచక్రవాహనదారులు, పాదచారులు నీటి గుంత లోతు తెలీక.. ఆ గుంతలో పడి గాయపడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులకు కోరినా.. వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూడలిలోని గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చంద్రమౌళీశ్వరుడికి కుంభాభిషేకం


అలంకరణలో చంద్రమౌళీశ్వరుడు

మడకశిర టౌన్, జూలై 8: పట్టణంలోని పావగడ రోడ్డులో వెలసిన చంద్రమౌళీశ్వరస్వామి కుంబాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి విశేష అలంకరణలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు సస్యశ్యామలం కావాలని, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కుంబాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శివలింగాన్ని పూర్తిగా నీటితో ముంచి కుంబాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, గుండుమల తిప్పేస్వామి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిత్రలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

మడకశిర(అమరాపురం): అమరాపురం మండల పరిధిలో మద్దనకుంట గ్రామంలో వెలిసిన పురాతనకాలం నాటి చిత్రలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం విశేష పూజా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు రఘు, టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ రవి, వీరలింగప్ప, నాగరాజు, హనుమంతరాయప్ప, రాధాకృష్ణ, మాజీ సర్పంచి శకునప్ప పాల్గొన్నారు.

తాండవేశ్వరుడికి పూజలు


అలంకరణలో తాండవేశ్వరుడు

లేపాక్షి, జూలై 8: ప్రసిద్ధిగాంచిన దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన అతిపురాతనమైన తాండవేశ్వరుడికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సీతాదేవి పాదం వద్ద వెలసిన తాండవేశ్వరుడిని ప్రతి సోమవారం భక్తులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు.

స్థలాల చుట్టూ కంచె వేశారు..

వైసీపీ నాయకులపై బాధితుల ఫిర్యాదు

హిందూపురం, జూలై 8: పట్టణంలోని రెండో పోలీస్ స్టేషన్ పరిధిలో సర్వేనంబర్ 405-2సీలో కొన్నేళ్ల క్రితం స్థలాలు కొనుగోలు చేశామనీ, మూడు రోజుల క్రితం కొంతమంది వైసీపీ నాయకులు స్థలం చుట్టూ కంచెవేశారని బాధితులు వాపోయారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో స్థలాలు కొనుగోలుచేసిన వ్యక్తులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు తమ స్థలాలను కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి, కంచె వేశారన్నారు. ఇందులో కొంతమంది ఆ స్థలం తమదేనంటూ తెరపైకి వస్తున్నారనీ, 35మంది అక్కడ స్థలాలు కొనుగోలు చేశామన్నారు. దీనిపై ఇప్పటికే కోర్టులో కూడా కేసు నడుస్తోందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో న్యాయవాది నాగన్న, నాగప్ప, రమేష్, ప్రసాద్, శ్రీనివాసులు, ఆదినారాయణప్ప, హిదాయతుల్లా పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే ప్రశస్తి ప్రదానం


గాయత్రీబాయిని సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పావగడ, జూలై 8 : సమాజ సేవకురాలు తేజశ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ గాయత్రి బాయిని సెమీవృక్ష సమితి రోటరీక్లబ్, సర్వధర్మం శాంతిపీఠం తరుపున సోమవారం సావిత్రిబాయి పూలే అవార్డు అందజేసి సన్మానించారు. స్థానిక కస్తూరీబా గాంధీ బాలికల వసతిగృహంలో విశ్వ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 15మంది గర్భిణులకు సీమంతం నిర్వహించారు. డీఈఓ ఇంద్రాణి, కేజీబీవీ ప్రిన్సిపాల్ సావిత్రమ్మ, రామ్మూర్తి స్వామీజీ చేతులమీదుగా ఈ అవార్డును ఆమెకు అందించి ప్రశంసించారు. విద్యా, వైద్య పరంగా గాయతిబాయి పావగడలో ఎన్నోసేవా కార్యక్రమాలు చేపట్టిందని, ఆమె సేవలు పేదలకు వరంగా మారాయని డీఈఓ ఇంద్రాణి కొనియాడారు. కార్యక్రమంలో జూనియర్ బాలకృష్ణగా వీరభద్రప్ప చేసిన నాట్యం ఎంతో ఆకర్షించింది. రోటరీ అధ్యక్షుడు సత్యలోకేష్, మానం శశికిరణ్, ఆదర్శ్ హెచ్ఎం వెంకటేశప్ప, మాస్టర్లు బసవరాజు, గంగప్ప పాల్గొన్నారు.

బంకులను తొలగించండి

: సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్


కమిషనర్‌తో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పెనుకొండ టౌన్, జూలై 8 : ప్రభుత్వ కార్యాలయాలకు అడ్డుగా ఉన్న బంకులను తొలగించాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. సోమవారం పెనుకొండ తెలుగుతల్లి సర్కిల్‌వద్ద ఉన్న లైబ్రరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లైబ్రెరీకి వచ్చేందుకు వీలులేకుండా ముందుభాగంలో వ్యాపార సముదాయాలు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌ను పిలిపించి తక్షణం వీటిని తొలగించాలని, అలాగే మరికొన్ని ప్రదేశాల్లో ప్రజలకు అసౌకర్యంగా ఉన్న బంకులను తొలగించాలని ఆదేశించారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

చిలమత్తూరు, జులై 8: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని టేకులోడు పంచాయతీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించి మురుగునీటి నిల్వలు, నీటి ట్యాంకుల అపరిశుభ్రత, వీధుల్లో చెత్తాచెదారం ఉండటంపై అధికారులపై మండిపడ్డారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే సమయమని, అలాంటప్పుడు నిర్లక్ష్యం పనికిరాదన్నారు. డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంటన డీఎల్‌డీఓ సమత, డీఎల్‌పీఓ వీరసేన నారాయణరెడ్డి, తహసీల్దార్ భాగ్యలత, ఎంపీడీఓ రామ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో అగళి



కనీస సౌకర్యాలు లేని బస్టాండ్, రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

అగళి, జూలై 8 : రాష్ట్ర సరిహద్దులో ఉన్న అగళి మండలం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. మండల కేంద్రంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు కనీసం నీడ లేకుండా పోయింది. దీనికి తోడు మరుగుదొడ్లు డ్రైనేజీలు, చెత్తాచెదారం, మురుగునీరు రోడ్లపైనే పారుతున్నాయి. అగళి నుంచి కర్నాటక ప్రాంతాలైన శిర, మధుగిరి, పసకెర ప్రాంతాలతోపాటు మడకశిర, పెనుకొండ, అనంతపురం, హిందూపురం ప్రాంతాలకు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. అగళి నుంచి పూలు, వ్యాపారం, నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఆర్థిక లావాదేవీలు కూడా అధికంగానే కొనసాగుతాయి. అయితే బస్టాండ్ సౌకర్యం కూడా లేకపోవడం విచిత్రం. అగళిలో వారం సంత , పశువుల సంత జరిగేది. నాలుగేళ్లగా వాటిని కూడా నిలిపేశారు. దీంతో కూరగాయలు కొనుగోలు చేయడానికి సమీప మండలమైన రొళ్లకు పోవాల్సి ఉంది. ఈ విషయాలను ఆ ప్రజాప్రతినిధులకు అధికారులకు అనేకమార్లు మండల సమావేశాల్లో విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలైన కల్పించి అగళిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని , లేదంటే మురికి నీరు కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదముందని స్థానికులు వాపోతున్నారు.

బస్టాండ్ ఏర్పాటు చేయండి : గోవిందప్ప, ప్రయాణికుడు



అగళిలో బస్టాండ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మరుగుదొడ్లు లేక మహిళలకు అవస్థలు తప్పడం లేదు. ఎండలు, వానలు అధికమైన సమయంలో కష్టాలు పడుతున్నాం. కొత్త ప్రభుత్వంలోనైనా బస్టాండ్ నిర్మించాలని కోరుకుంటున్నాం

మరుగుదొడ్లు నిర్మించండి: సాకమ్మ



బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేక మూత్రవిసర్జనకు వెళ్లాలంటే మహిళలు ఇబ్బంది పడుతున్నాం. కనీసం వృద్ధులకు కూడా ప్రత్యేక సౌకర్యాలు లేవు. నిత్యం పలు అవసరాల కోసం మండల కేంద్రానికి వచ్చేఇ వారికి తిప్పలు తప్పడం లేదు. అధికారులు సమస్యలు పరిష్కరించాలి.

ఇసుక కుంభకోణంలో రూ.50 వేల కోట్లు దోచేశారు

● మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆరోపణ


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

మడకశిరటౌన్, జూలై 8: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సొంతింటి కలను దూరం చేశారని, ఆయన పాలనలో రూ.50వేల కోట్లు ఇసుక కుంభకోణం ద్వారా ఆదాయం సమకూర్చుకొన్నారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆరోపించారు. సోమవారం సాయంత్రం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ పేదలకు అండగా నిలుస్తారని చెప్పడానికి ఉచిత ఇసుక పాలసీనే నిదర్శనమని, జీఓ నెంబర్ 47 అమలులోకి తెచ్చి పేదలకు సొంతింటికల పై ఆశలు రేకెత్తించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక మాఫియాలో ఆపార్టీ నేతలే స్వయంగా ఇసుకాసురుల అవతారం ఎత్తి దోచుకొన్నారని, పేదలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఖర్చు పెడితే ఇసుకను కొనడానికి రూ.3లక్షలు ఖర్చుపెట్టే పరిస్థితికి తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గృహ నిర్మాణానికి ఇసుకను సరఫరా చేస్తామని రూ.98 లక్షల టన్నుల ఇసుకను జగన్ రెడ్డి అండ్ కో మింగేశారన్నారు. ముఖ్యమంత్రి ఉచిత ఇసుక పాలసీతో పేదలకు ఉపయోగకరమన్నారు.

పేదవిద్యార్థులకు కార్పొరేట్ విద్యే లక్ష్యం

పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్నదే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం కేపీ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే నోటు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ రహిత నీటిని అందించడమే లక్ష్యం

పట్టణంలో ఫ్లోరైడ్ రహిత నీటిని అందించాలన్న సంకల్పంతోనే ఎన్‌టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌ను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్‌ను వైసీపీ నిర్లక్ష్యంతో మూత పడ్డాయన్నారు. పట్టణ వాసులకు తక్కువ ధరతోనే శుద్ధమైన నీటిని అందించాలని ప్లాంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని అమరాపురం బస్టాండు ఆవరణంలో డివైడర్ మధ్యలో మొక్కలను నాటారు. జూనియర్ కళాశాల మైదానంలో జిమ్ ఏర్పాటుకు గదులను పరిశీలించారు. అనంతరం డిగ్రీ కళాశాల వద్ద ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను ఏర్పాటు చేసేందుకు గదులను పరిశీలించారు. త్వరలో డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ ప్రారంభిస్తామన్నారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 8: కుటుంబ కలహాల కారణంగా ఆంజనేయులు అనే వ్యక్తి శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పటించుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం చిలమత్తూరు మండలంలోని భూమయ్యగారిపల్లికి చెందిన ఆంజనేయులు, రాధమ్మ దంపతులు ఘర్షణ పడ్డారు. ఈసందర్భంగా భర్త భార్యపై చేయి చేసుకోవడంతో ఆమె మనస్థాపానికి గురైంది ఆమె పుట్టినింటికి అలిగి వెళ్లిపోవడానికి సిద్ధపడగా, భర్త ఆమెను ఆపే ప్రయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య తన మాట వినలేదన్న ఆగ్రహంతో పెట్రోల్‌పోసుకుని నిప్పటించుకున్నాడు. ముఖం, శరీరంపై 40శాతం కాలిన గాయాలతో ఉండగా, గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్తను నిలువరించే ప్రయత్నంలో ఆమె రెండు చేతులకు స్వల్పంగా కాలినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం పరిస్థితి విషయంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం ప్రైవేట్ వాహహనంలో హిందూపురం తరలించారు. అక్కడనుంచి అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

మండలంలోని చెండూరువాండ్లపల్లికి చెందిన రైతు వెంకటరాముడు పాముకాటుకు గురై సోమవారం అస్వస్థతగు గురయ్యారు. గంగులప్పకు మారుడైన వెంకటరాముడు పొలంలో పనులు చేస్తుండగా కుడిచేతిపై నాగు పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు గోరంట్ల ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ ఉషా వైద్య చికిత్సచేసి, మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు. అయితే అంబులెన్స్ గంట ఆలస్యంగా వచ్చిందని కుటుంబ సభ్యులు వాపోయారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

అగళి, జూలై 8: మండలంలోని ఇరిగేపల్లి గ్రామ సమీపంలోని సువర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ వీరేశ్ వీరేష్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుకను రవాణా చేసుకోవాలన్నారు. 8వ తేదీ నుంచి ఉచిత ఇసుకను ప్రభుత్వం విడుదల చేసిందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల మేరకు తోలుకోవాలన్నారు. ఇసుక తవ్వినందుకు లోడ్ చేసినందుకు, డిపోలవరకు తరలించినందుకు లేబర్ ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, జీఎస్టీ చెల్లించవలసి ఉంటుందన్నారు. సగటు ఒక రోజుకు 20టన్నులు మాత్రమే పంపిణీ చేస్తారన్నారు. ఆధార్, ఫోన్‌నంబరు, సమర్పించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

రేపు ఎక్సైజ్ వాహనాల వేలం

పెనుకొండ, జూలై 8 : పెనుకొండ సెబ్ సర్కిల్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ పలు ద్విచక్రవాహనాలను బుధవారం ఉదయం 10గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఆసక్తిగలవారు ఆధార్ కార్డుతో పాటు నిర్ణయించిన ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సెబ్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

పాఠశాలల తనిఖీ

రొళ్ల, జూలై 8: మండలంలోని హొట్టేబెట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొడగార్లగుట్ట కాలనీ ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ శ్రీధర్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన వంటపాత్రలు వాడాలని, బియ్యం పాఠశాలలోనే నిల్వ ఉంచాలని సూచించారు. చిక్కీలు, కోడిగుడ్ల స్టాకు రికార్డులను తనిఖీ చేశారు.

దళిత వైద్యుడిని అవమానించినపుడు నోరులేదా..?

● గ్రామాల్లో చిచ్చు పెట్టవద్దు: మాజీ మంత్రి ఉషశ్రీపై టీడీపీ నాయకుల మండిపాటు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, జూలై 8: జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు దళిత వైద్యుడు సుధాకర్‌ను అవమానించాడని, ఆయన ఆత్మహత్యకు పాల్పడినప్పుడు మీ నోరు ఏమయ్యిందని మాజీ మంత్రి ఉశశ్రీపై రొద్దం టీడీపీ నాయకులు మండిపడ్డారు. మండలంలోని కంచిసముద్రంలో నాలుగు రోజుల క్రితం ఇరువర్గాల దళితుల మధ్య గొడవలు తలెత్తి ఘర్షణ చోటుచేసుకుంది. టీడీపీకి చెందిన నరేష్, వైసీపీకి చెందిన నరసింహులు ఒకరినొకరు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ గ్రామానికి చేరుకుని దళితుల మధ్య చిచ్చు పెట్టారంటూ మంత్రి సవితపై నిందలు మోపడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య, మాదవనాయుడు మాట్లాడుతూ అమావాస్యకి, పౌర్ణమికి మాజీ మంత్రి ఉశశ్రీ చరణ్ చుట్టపుచూపుగా రావడం సరి కాదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతోమంది దళితులపై దాడి జరిగిందన్నారు. అప్పుడు ఖండించని ఆమె ఇప్పుడు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. దళిత నాయకులు కృష్ణ, బేల్దారి క్రిష్ణ, హనుమక్క, చంద్రన్న, బలిజ నాగేంద్ర, నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు

● టీడీపీ నాయకులు మండిపాటు


కేక్‌కట్‌చేసి విద్యార్థులకు పంచుతున్న వైసీపీ నాయకులు

హిందూపురం, జూలై 8: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హిందూపురం పట్టణ పరిధిలోని మోతుకపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం వైసీపీ నాయకులు వెళ్లి కేక్ కట్‌చేసి జరుపుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సరికాదని టీడీపీ నాయకులు అన్నారు. దీనిపై ఎంఈఓ గంగప్పను వివరణ కోరగా.. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా నోటు పుస్తకాలు పంపిణీ చేయడానికి పాఠశాలకు వెళ్లారన్నారు. కేక్‌కట్‌చేసి, జయంతి నిర్వహించిన విషయం తన దృష్టికి రాలేదన్నారు.

శిథిలావస్థలోని భవనాలను కూల్చేయాలి..

మడకశిర రూరల్, జూలై 8 : మండలంలోని జమ్మానిపల్లి,తురుకువాండ్లపల్లి గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాలను తొలగించాలని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు, మండల మైనార్టీ మండల అధ్యక్షులు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజును సోమవారం విశ్రాతి భవనంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

డ్రైవింగ్‌లో అప్రమత్తత అవసరం

● జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఏడీజే కంపల్లె శైలజ

హిందూపురం, జూలై 8: వాహనం నడిపేటపుడు అప్రమత్తంగా ఉండాలని, దీనివల్ల ప్రమాదాలు తగ్గే ఆస్కారం ఉంటుంని జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ పేర్కొన్నారు. సోమవారం కోర్టు ఆవరణలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే సంబంధిత వాహన యజమానిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరని, వాహనానికి బీమా సౌకర్యం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదర్, జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మీ, ఏపీపీ ఇందాద్, సుహాసిని, న్యాయవాదులు సుదర్శన్, నాగరాజరెడ్డి, సిద్దు, సత్యనారాయణ, సంతోష్ కుమారి పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి..

● తహసీల్దార్‌కు స్థానికుల వినతి

హిందూపురం(పరిగి), జూలై 8: పరిగిలోని ఇందిరమ్మ కాలనీలో పేద ప్రజలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. 2007ప్రభుత్వ హయాంలో ఇంటి పట్టా అందజేయడంతోపాటు ప్రజా ప్రయోజనాల కోసం కాలనీలో కొంతమేర ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం గుర్తించింది. అయితే రోజులు గడిచే కొద్ది భూకబ్జాదారులు ఖాళీ స్థలంతోపాటు వంకలు, వాగులు కూడా ఆక్రమిస్తున్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా దేవాలయం, బడి, చిన్నారుల కోసం పార్కు నిర్మాణం చేపట్టాలంటూ స్థానిక ప్రజలు సోమవారం పరిగి తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందించారు. సర్వేనంబరు 283లోగల స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలో ఉందోలేదో విషయాన్ని పరిశీలించి ప్రజాప్రయోజనాల కోసం వాడాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

జీతాలు చెల్లించాలని కార్మికుల ధర్నా


డీఎల్‌పీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

పెనుకొండ, జూలై 8 : బకాయి పడ్డ జీతాలను చెల్లించాలని పారిశుధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. పెనుకొండ డీఎల్‌పీఓ కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయు ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో సీఐటీయూ నాయకుడు రమేష్ మాట్లాడుతూ పరిగి గ్రామ పంచాయతీ, పారిశుధ్య కార్మికులకు ఏడు నెలలు, గ్రీన్ అంబాసిడర్లకు తొమ్మిది నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. ఏడు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. అనంతరం డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన పరిగి ఈఓఆర్డీ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి అరుణకు పది రోజుల్లోగా జీతాలు చెల్లించాలని ఆదేశించారు. అధికారుల హామీతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు మల్రెప్ప, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం


దివ్యకు నగదును అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

మడకశిర రూరల్, జూలై 8 : మండలంలోని చత్రం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు మాలతి పేద విద్యార్థి దివ్యకు రూ.5 వేలు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఆమె ఇంటర్‌లో ఇంటర్‌లో 1000 మార్కులకు 967 మార్కులు సాధించిందన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదన్నారు. ఉపాధ్యాయులు దివ్యను అభినందించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

గోరంట్ల, జూలై 8: మండలంలోని దిగువ గంగమ్మపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఇఓ జాన్‌రెడ్డెప్ప సోమవారం నోషు పుస్తకాలు అదించారు. అదే గ్రామానికి చెందిన చిగిని నంజిరెడ్డి జ్ఞాపకార్థం భార్య ఆదిలక్ష్మమ్మ, కుమారులు ప్రకాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిలు విద్యాసామాగ్రిని అందజేశారు. విద్యార్థులు బాగా చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని దాతలు కోరారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌నాయక్, భైయప్ప రెడ్డి, హనుమంతు, అధ్యాపకులు మల్లికార్జున, విద్యార్థులు, తల్లిదండ్రులున్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి : ఎంపీడీఓ

గుడిబండ, జూలై 8 : గ్రామాల్లో వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బంగారమ్మ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ట్యాంకులు, డ్రైనేజీలు, గ్రామాల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్‌ను చల్లి వీధులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మీ, ప్రకాశ్, గోవిందప్ప, రమేష్, అమరేష్, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులపై స్థానికుల హర్షం

మడకశిర(అమరాపురం), జూలై 8: ఎన్నో ఏళ్లుగా అస్తవ్యస్థంగా ఉన్న రహదారికి మరమ్మతులు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరాపురం మండల పరిధిలోని మద్దనకుంట గ్రామ పంచాయతీకి చెందిన పుల్లికుంట గ్రామానికి వెళ్లడానికి చాలా ఏళ్లుగా సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. వర్షంతో కోతకు గురై గ్రామస్థులు గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గత ప్రభుత్వాలు ఈరహదారిని పట్టించుకోకపోవడంతో గ్రామస్థులకు నరకయాతన పడేవారు. ఈవిషయాన్ని ఇటీవల ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుకు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీఓను ఆదేశించారు. రహదారికి మరమ్మతులు చేపట్టడంపై మండల టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలపారు.


రూపు దిద్దుకుంటున్న పుల్లికుంట రహదారి